## క్లుప్తంగా

### రక్తదానం ఆరోగ్యానికి మంచిది

**వేంపల్లె :** రక్తదానం చేయడం ఆరోగ్యానికి ఎంతో మంచిదని హ్యాండ్స్ ఫోర్ యూ స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ సుబ్బారావు పేర్కొన్నారు. శనివారం ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ఎన్ఎస్ఎస్ యూనిట్ -2, 8 ఆధ్వర్యంలో రక్తదాన అమృత మహోత్సవం -2.0 భాగంగా రక్తదాన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదాన అమృత మహోత్సవ కరపత్రాలు విడుదల చేశారు. అనంతరం ఫౌండర్ సుబ్బారావు మాట్లాడుతూ రక్తదానం గురించి వాటి మీద చాలామందికి ఉన్న అపోహలు గురించి వివరించారు. ప్రతి ఆరు నెలలకొకసారి రక్తదానం చేయడంవల్ల మనిషి ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఏవీఎస్ కుమారస్వామి గుప్తా, పరిపాలన అధికారం రవికుమార్, ఎన్ఎస్ఎస్ అధికారులు రత్నకుమారి, దీప్తి తదితరులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**పులివెందుల రూరల్ :** పులివెందుల పట్టణంలోని 11 కేవీ ఇండస్ట్రియల్ ఫీడర్ కింద ట్రాన్స్‌ఫార్మర్ ఎరెక్షన్ ఉన్న సందర్భంగా ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ ఏఈ జగదీశ్వరరెడ్డి తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

### గువ్వలచెరువు ఘాట్‌లో ట్రాఫిక్‌కు అంతరాయం

**చింతకొమ్మదిన్నె :** చింతకొమ్మదిన్నె మండల పరిధిలోని గువ్వలచెరువు ఘాట్ ఆంజనేయ స్వామి దేవాలయం సమీపంలోని శుక్రవారం రాత్రి మలుపు వద్ద జాతీయ రహదారిపై రోడ్డుకు అడ్డంగా ఆయిల్ ట్యాంకర్ బోల్తా పడటంతో ట్రాఫిక్ జామ్ అయింది. ట్యాంకర్‌లోని ఆయిల్ లీక్ కావడంతో వాహనాలు పట్టు తప్పి కిందపడ్డాయి. శనివారం ఉదయం కంకర డస్ట్ ఆయిల్‌పై వేసి క్రేన్ల సహాయంతో ఆయిల్ ట్యాంకర్‌ను తొలగించి, ట్రాఫిక్ క్లియర్ చేశారు.

### అన్నదానం.. పుణ్యకార్యం

**లింగాల :** మండలంలోని ఇప్పట్ల గ్రామ సమీపంలోని లీలావతి చారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమంలో శనివారం వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా యూత్ విభాగపు సెక్రటరీ మార్తల అశోక్ కుమార్‌రెడ్డి తన తండ్రి మార్తల పుల్లారెడ్డి వర్ధంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నదానం పుణ్యకార్యమని, వృద్ధులకు అన్నదానం చేయడం తనకు ఆనందాన్ని కలిగిస్తోందని అశోక్ కుమార్‌రెడ్డి తెలిపారు.

### డ్రాయింగ్‌లో విద్యార్థుల ప్రతిభ

**చక్రాయపేట :** మండల కేంద్రమైన చక్రాయపేట ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులు చిత్ర లేఖనంలో ప్రతిభ చూపారని ఇన్‌చార్జి హెచ్ఎం నాగేంద్ర తెలిపారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా చక్రాయపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చిత్ర లేఖన పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ చిత్ర లేఖనం పోటీల్లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు మేథస్సును వెలికి తీసే విధంగా చిత్ర లేఖనం వేయడం సంతోషంగా ఉందన్నారు. చిత్ర లేఖనం పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను డ్రాయింగ్ మాస్టర్, సురేష్‌కుమార్ ఉపాధ్యాయులు అభినందించారు.

### విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

**వేముల :** మండల కేంద్రమైన వేములలోని మక్కా మసీదులో వైఎస్సార్‌సీపీ మండల పరిశీలకుడు లింగాల రామలింగారెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ముస్లిం యూత్ ఆధ్వర్యంలో ముస్లిం విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. అరబీ పుస్తకం, ఉర్దూ కాపీ రైటింగ్ పుస్తకాలతోపాటు బోధన పుస్తకాలు, అవసరమైన వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో ముస్లిం నాయకులు మునీర్, మదార్‌వల్లి, దౌలత్, మదర్సా, గౌస్ పీర్, బాబా వల్లి, లతీఫ్, మాలిక్, సాహిల్ పాల్గొన్నారు.

### రూ.2లక్షలు పలికిన గణేష్ లడ్డూ

**జమ్మలమడుగు :** పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో టీకేఆర్ వీధిలో ఏర్పాటు చేసిన గణేషుడి లడ్డూను వైఎస్ జగన్ యువసేన నాయకులు దక్కించుకున్నారు. శనివారం సాయంత్రం గణనాథుడి నిమజ్జనం సందర్భంగా లడ్డూ వేలం పాట నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్ యువసేన తరఫున కో ఆప్షన్ సభ్యులు లక్షుమయ్య వేలం పాటలో రూ. 2 లక్షలకు లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్నారు. ఈ సందర్భంగా లక్షుమయ్య మాట్లాడుతూ ప్రసాదాన్ని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అదిస్తామని తెలిపారు.

### రైతులకు అందుబాటులో యూరియా

**జమ్మలమడుగు :** నియోజకవర్గంలో సాగుకు అవసరమైన యూరియాను అందుబాటులో ఉందని ఆర్డీఓ సాయిశ్రీ, పేర్కొన్నారు. శనివారం స్థానిక ఆర్డీఓ చాంబర్‌లో వ్యవసాయాధికారులు, పోలీసులతో కలిసి ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు కావలసిన ఎరువులు, యూరియా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. నియోజకవర్గానికి ప్రస్తుతం 519 టన్నుల యూరియా కేటాయించారని పేర్కొన్నారు. ఇప్పటి వరకు రైతులు 500 క్వింటాళ్లు తీసుకుపోయారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐ నరేష్‌బాబు, ప్రొద్దుటూరు వ్యవసాయాధికారి సుస్మిత తదితరులు పాల్గొన్నారు.

# హామీలు అమలు చేసే వరకు పోరాటం

- 9న రైతుల ర్యాలీ జయప్రదం చేయండి
- ఎమ్మెల్సీ పి. రామసుబ్బారెడ్డి పిలుపు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి

**జమ్మలమడుగు :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు పోరాటం ఆగదని ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో యూరియా కొరత తీవ్రంగా ఉందని తెలిపారు. ఇందుకు నిరసనగా ఈనెల 9వ తేది ఉదయం 9గంటలకు రైతులకు మద్దతుగా ర్యాలీ నిర్వహిస్తున్నామని నాయకులు, కార్యకర్తలు, రైతులు జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో పట్టణ, మండల నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలను పట్టించుకోవడంలేదని విమర్శించారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక అల్లాడిపోతున్నారని తెలిపారు. పంట నష్టపోయిన రైతులకు రాష్ట్ర ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమైపోయిందన్నారు.

**వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో..**

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో రబీ సీజన్‌లో నష్టపోయిన రైతులకు ఖరీఫ్ సీజన్ ప్రారంభం నాటికే పరిహారం అందించి రైతులకు భరోసా కల్పించేవారని గుర్తుచేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో ఏనాడు రైతులు రోడ్లపైకి వచ్చి ఎరువుల కోసం పడిగాపులు పడిన సందర్భం లేదని తెలిపారు. ప్రస్తుతం యూరియా దొరక్క రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా.. కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. పెద్దముడియం మండలంలో సోలార్ కంపెనీ ప్రతినిధులు రైతుల భూముల్లో వారికి తెలియకుండా గుంతలు తవ్వుతున్నారని తెలిపారు. పోలీసులకు ఫిర్యాదులు చేసిన పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. రైతులను మోసం చేసి వారి భూములను లీజుకు రాయించుకుంటున్న ప్రభుత్వ పట్టించుకోలేదని తెలిపారు. రాజోళి ఆనకట్ట భూములు కొల్పోయిన ప్రతి రైతుకు ఎకరాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 12 లక్షల పరిహారం ఇస్తామని ప్రకటించి నోటిఫికేషన్ ఇచ్చారని, అయితే యువగళం పాదయాత్రలో మంత్రి లోకేష్, టీడీపీ నాయకుడు భూపేష్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆదినానారయణరెడ్డి ఏకంగా ఎకరాకు 24 లక్షల రూపాయలు ఇస్తామని ప్రకటించారని గుర్తుచేశారు. ఇప్పుడు మాత్రం మంత్రి నారా లోకేష్ రాజోళి ఆనకట్ట నిర్మాణం ఖర్చుతో కూడుకున్నదని చేతులు ఎత్తేశారని విమర్శించారు. రైతుల తరఫున పోరాటం చేస్తామని చెప్పారు.

# నేత్ర దానంతో అంధుల జీవితాల్లో వెలుగు



మాట్లాడుతున్న డాక్టర్ సుభాషిణి

**వేంపల్లె :** నేత్రదానంతో అంధుల జీవితాల్లో వెలుగు సాధ్యమవుతుందని ఆప్తాల్మిక్ ఆఫీసర్ రెడ్డయ్య, డాక్టర్ సుభాషిణి అన్నారు. శనివారం మండలంలోని తాళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నేత్రదాన పక్షోత్సవాలపై వైద్య సిబ్బందికి అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేత్రాల దానం ఎవరు చేయవచ్చు, ఎవరు చేయకూడదనే విషయంపైన నేత్రదానం ప్రాముఖ్యతను తెలియజేశారు. శుక్లము, గ్లకోమా, మధుమేహం, న్యూరోపతి, హెచ్ఐవీ వంటి రోగాలు కలిగిన వారు నేత్రదానం చేయడానికి అర్హులు కారన్నారు. ఈ సందర్భంగా షార్ట్ క్విజ్‌ను ఏర్పాటు చేసి మొదటి, రెండు, మూడవ బహుమతులను అందజేశారు. మనిషి మరణించిన తర్వాత 6గంటలలోపు నేత్రాలను దానం చేయాలని తెలిపారు. 96గంటలలోపు మరొక వ్యక్తికి అమర్చాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సుభాషిని, డాక్టర్ శాంతి, సిహెచ్ఓ వెంకటరత్నం, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ అరుణాదేవి, సూపర్‌వైజర్ అంకయ్య, ఏఎన్ఎం, ఆశాలు పాల్గొన్నారు.

### నేడు ప్రముఖ వైద్య నిపుణులు రాక

**పులివెందుల :** పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్ (గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి డాక్టర్ ఈసీ దినేష్‌రెడ్డి తెలిపారు. ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ క్రాంతికుమార్ మెదడు, వెన్నెముక, నరాలు, తిమ్మిర్లు, వంటి, ఒళ్లు నొప్పులకు వైద్య చికిత్సలు నిర్వహిస్తారన్నారు. కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుంచి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె సంబంధిత జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. అలాగే ప్రముఖ క్యాన్సర్ వ్యాధి నిపుణురాలు డాక్టర్ నిహారిక క్యాన్సర్ అవగాహన, స్క్రీనింగ్, క్యాన్సర్ రోగులను క్రమం తప్పకుండా అనుసరించడం, ఇతర క్యాన్సర్ సంబంధిత సంప్రదింపులు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ఆసుపత్రిలో నూతనంగా డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించడం జరిగిందని, కిడ్నీ సేవలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 08568286189, 9963170177 అనే ఫోన్ నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

# గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల నిరసన



మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న వార్డు సచివాలయ ఉద్యోగులు

**జమ్మలమడుగు:** రాష్ట్రప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల విధులపై శుక్రవారం విడుదల చేసిన ఆదేశాలు సచివాలయ ఉద్యోగుల ఆత్మ గౌరవాన్ని చులకన చేసే విధంగా ఉన్నాయని, వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన కల్పించేందుకు ఇంటింటికి వెళ్లడాన్ని తాము బహిష్కరిస్తున్నామని.. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సచివాలయ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, ఆర్డీఓ సాయిశ్రీకి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోజు రోజుకు ఉద్యోగుల ఆత్మ గౌరవాన్ని మరింత దిగజారుస్తూ, పరిపాలనలో కీలకమైన సచివాలయ ఉద్యోగుల శక్తిని నిర్వీర్యం చేసేలా అధికార వర్గాలు ప్రవర్తిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో వలంటీర్లు ఒక క్లస్టర్‌కు పరిమితమై నిర్వహించిన విధులను సచివాలయ ఉద్యోగులకు ఒకటి కంటే ఎక్కువ క్లస్టర్లకు మ్యాప్ చేసి బలవంతంగా ఇంటింటికి తిరిగే విధులు అప్పగిస్తున్నారని తెలిపారు. వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన కల్పించేందుకు ప్రతి ఇంటికి వెళ్లాలని అధికారుల ఆదేశాలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ విధులు బహిష్కరించాలని నిర్ణయించినట్లు తెలిపారు. తమ బాధను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవాలనే ఉద్దేశంతోనే నిరసన తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ జానీ, నిఖిల్ కృష్ణ, అబ్దుల్ రజాక్ పాల్గొన్నారు.

**ఎర్రగుంట్ల:** యర్రగుంట్ల మున్సిపల్ పరిధిలో పనిచేస్తున్న సచివాలయ ఉద్యోగులు పనిభారం తగ్గించాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక పిలుపు మేరకు శనివారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ శేషఫణికి వినతి పత్రం అందజేశారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ మాట్లాడుతూ గత ప్రభుత్వం సచివాలయాల వ్యవస్థను తీసుకువచ్చి వాలంటీర్, సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసిందని, వాలంటీర్ ప్రతి 50 కుటుంబాలకు వారధిగా పనిచేసి సేవలందించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాలంటీర్ వ్యవస్థను తొలగించి ఎలాంటి ప్రతిఫలం లేకుండా సచివాలయ సిబ్బందికి అప్పగించడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు.

### ఘనంగా త్రిశూల ప్రతిష్టాపన

**పులివెందుల టౌన్ :** పులివెందుల పట్టణంలోని స్థానిక పెద్ద మసీదు సమీపంలో ఉన్న శ్రీపోలేరమ్మ ఆలయానికి సంబంధించి త్రిశూల ప్రతిష్టాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం హిందు జేఏసీ, బీజేపీ నాయకులు కలిసి పూజ కార్యక్రమం నిర్వహించారు. సోమేపల్లె కృష్ణరాజేష్ శర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించి త్రిశూల ప్రతిష్టాపన పూజ కార్యక్రమాలు నిర్వహించి భూమి పూజ చేశారు. హిందు జేఏసీ నాయకులు భానుప్రకాష్, సోపాల వీరా, ఐటీఐ సాయి, కొండ్రావు తదితరులు పాల్గొన్నారు.

### అధికారులకు సత్కారం

**చింతకొమ్మదిన్నె :** మండలంలో సంపూర్ణత అభియాన్ అభివృద్ధి లక్ష్య సాధనకు కృషి చేసిన అధికారులను శనివారం ఘనంగా సత్కరించారు.కడప శివారులోని మాధవి కన్వెన్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో అత్యుత్తమ సేవలకుగాను చింతకొమ్మదిన్నె ఎంపీడీఓ కుల్లాయి బాబుకు, చింతకొమ్మదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ రాఘవేంద్ర, డాక్టర్ సునీత, ఆస్పత్రి సిబ్బందికి జిల్లా కలెక్టర్ జారీ చేసిన మెమెంటోలు, సర్టిఫికెట్లు ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యక్రమ నిర్వహణాధికారి హాజరత్తయ్య మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది వారికి నిర్దేశించిన లక్ష్యంలో విశిష్టమైన సేవలు అందించారని తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ వైద్యసిబ్బంది సమర్థత, సేవాభావం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, ఆరోగ్య శాఖ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎంపీడీఓ కార్యాలయం తనిఖీ



ఎంపీడీఓ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ ఓబుళమ్మ

**సింహాద్రిపురం :** మండల కేంద్రమైన సింహాద్రిపురంలోని ఎంపీడీఓ కార్యాలయాన్ని శనివారం జెడ్పీ సీఈఓ ఓబుళమ్మ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె కార్యాలయ రికార్డులను పరిశీలించి వివరాలను ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆమె సింహాద్రిపురంలో పర్యటించి పలు షాపుల వద్ద పరిశుభ్రంగా ఉంచుకోవాలని షాపు యజమానులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**ఎరువుల దుకాణాల తనిఖీ**

మండల కేంద్రమైన సింహాద్రిపురంలో శనివారం ఎరువుల దుకాణాలను విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు ఎరువుల దుకాణాల్లో గ్రౌండ్ బ్యాలెన్స్, స్టాకు వివరాలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతులకు నాణ్యత కలిగిన ఎరువులను, పురుగు మందులను మాత్రమే విక్రయించాలని ఆదేశించారు. స్టాక్ బోర్డులో ధరలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఓ కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

### సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

**ముద్దనూరు :** సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జమ్మలమడుగు డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ వి.గీత సూచించారు. శనివారం ఆమె మండలంలోని కోడిగాండ్లపల్లెలో వైద్య శిబిరాన్ని తనిఖీ చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ గీత సిబ్బందితో మాట్లాడుతూ జ్వరాలు తగ్గేవరకు శిబిరాలు నిర్వహించాలని తెలిపారు. అనంతరం గ్రామంలో జ్వరాల బారిన పడిన వారిని ఆమె పరామర్శించారు. గ్రామంలో ఫాగింగ్ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ కరిష్మా,హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

# ధ్యానంతో మానసిక ఒత్తిడి దూరం

**వేంపల్లె :** ధ్యానం చేయడం వలన మానసిక ఒత్తిడి దూరమవుతుందని కడప ఫిరమిడ్ స్పిరిచువల్ సొసైటీకి చెందిన ఫిరమిడ్ మాస్టర్స్ సంజీవ్, బాల శివప్రసాద్ పేర్కొన్నారు. శనివారం స్థానిక శ్రీ చైతన్య ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ధ్యానం ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు ధ్యానం చేయడం వలన కలిగే ఆత్మ శాంతి, ఏకాగ్రత, మానసిక స్పష్టత, తదితర అంశాలను వివరించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఒత్తిడిని ఎదుర్కొంటున్న తరుణంలో ధ్యానం ఒక అద్భుతమైన సాధనమని వారు విషదీకరించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణి రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్లు చేతన్ రెడ్డి, చైతన్యరెడ్డి, ఫిరమిడ్ మాస్టర్స్ రాము, వంశీ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### చంద్రగ్రహణంతో ఆలయం మూసివేత

**చింతకొమ్మదిన్నె :** చంద్రగ్రహణాన్ని పుర్కరించుకుని మండలంలోని కొత్తపేట గంగమ్మ తల్లి ఆలయం ఆదివారం సాయంత్రం నాలుగు గంటల నుంచి మూసివేస్తారని ఈఓ కృష్ణ నాయక్ తెలిపారు. తిరిగి సోమవారం తెల్లవారుజామున సంప్రోక్షణ చేసి ఉదయం ఐదు గంటలకు ఆలయం తెరుస్తారని పేర్కొన్నారు. అనంతరం పుణ్యాహవాచనం, ఆలయ శుద్ధి, స్వామివారి అభిషేకం, సర్వదర్శనం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు ఈ విషయాన్ని భక్తులు గుర్తించాలని ఆయన కోరారు.

# మానవతా విలువలు పాటించాలి



అన్నదానం వద్ద ఫాతెహా చేస్తున్న దస్తగిరి స్వామి

**కమలాపురం :** మహమ్మద్ ప్రవక్త చెప్పిన విధంగా మానవతా విలువలు పాటిస్తూ పరమత సహనం, శాంతి, కలిగి ఉండాలని స్థానిక పెద్ద దర్గా పీఠాధిపతి సోదరుడు దస్తగిరి స్వామి అన్నారు. కుమ్మర వీధిలో వెలసిన మదరసా ఏ షహమీరియా తాళిముల్ ఖురాన్ వద్ద నౌజవాన్ కమిటీ సభ్యులు, లవ కుశ ఫారుక్, 16వ వార్డు కౌన్సిలర్ ఖాజా హుసేన్, అయుబ్, కెప్టెన్ బాబు ఆధ్వర్యంలో శనివారం అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహ్మద్ ప్రవక్త జయంతి, వర్థంతిని పురస్కరించుకొని అన్నదానం ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో భక్తులు, స్థానిక

### రాజీ మార్గమే రాజమార్గం

**కమలాపురం:** కేసుల సత్వర పరిష్కారానికి రాజీయే రాజ మార్గమని కమలాపురం జూనియర్ సివిల్ కోర్టు మెజిస్ట్రేట్ మధు సూధన్ రావు తెలిపారు. శనివారం స్థానిక కోర్టు హాల్‌లో కోర్టు పరిధిలోని పోలీస్ స్టేషన్‌లకు సంబంధించిన సీఐ, ఎస్ఐలతో సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా మెజిస్ట్రేట్ మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని కోరారు. లోక్ అదాలత్‌లో కమలాపురం కోర్టు పరిధిలో అత్యధిక కేసులు పరిష్కారం అయ్యేలా కృషి చేయాలని సూచించారు. పోలీస్, కోర్టు సిబ్బంది సమన్వయంతో పని చేసి ఇరు వర్గాలను పిలిచి వారికి కౌన్సిలింగ్ ఇచ్చి రాజీ కుదిర్చి కేసులు పరిష్కరించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. లోక్ అదాలత్‌లో పైసా ఖర్చు లేకుండా కేసులను పరిష్కరించుకోవచ్చని కక్షిదారులకు సూచించాలని ఆదేశించారు. వివిధ పోలీస్ స్టేషన్ల సీఐలు, ఎస్ఐలు, పోలీస్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

### తాగునీటి సమస్యపై దృష్టి

**పులివెందుల రూరల్ :** పులివెందుల నియోజకవర్గంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక దృష్టి సారిస్తామని పులివెందుల ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ శ్రీనివాసులు తెలిపారు. శనివారం ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈగా శ్రీనివాసులు బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఈఈగా పనిచేస్తున్న విజయభాస్కర్ పదోన్నతిపై రాయదుర్గానికి వెళ్లారు. ఆయన స్థానంలో ఈఈగా శ్రీనివాసులు పులివెందులకు బదిలీపై వచ్చారు.

# సేవలో తరించి.. పురస్కారం వరించి

ఉత్తమ సేవలు అందించిన ఉపాధ్యాయులకు పురస్కారం అందజేశారు. 64 మందికి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ప్రదానం చేశారు. ఇందులో పులివెందుల, జమ్మలమడుగు, కమలాపురం నియోజకవర్గాల్లో పనిచేస్తున్న పలువురు ఉపాధ్యాయులను గురుపూజోత్సవ వేడుకలను పురస్కరించుకుని కడపలోని కలెక్టరేట్‌లోని సభాభవన్‌లో అవార్డు, ప్రశంసాపత్రాలతో సత్కరించారు.



కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న హెచ్ఎం నాగిరెడ్డి



సరస్వతి, హెచ్ఎం, సీకే దిన్నె



రామకృష్ణమ్మ, హెచ్ఎం, జమ్మలమడుగు



శ్రీదీపారెడ్డి, పీజీటీ, వల్లూరు



నాగార్జున, స్కూలు అసిస్టెంట్, కొండాపురం



భార్గవి ప్రియదర్శిని, స్కూలు అసిస్టెంట్, పులివెందుల



మహాలక్ష్మి, స్కూలు అసిస్టెంట్, కొండాపురం



శ్రీదీప, స్కూలు అసిస్టెంట్, చక్రాయపేట



ఎరికలరెడ్డి, స్కూలు అసిస్టెంట్, చక్రాయపేట



ప్రసాద్‌రెడ్డి, స్కూలు అసిస్టెంట్, పులివెందుల



ఫైరోజ్ జహాన్, స్కూలు అసిస్టెంట్, వేంపల్లె



మంజులాదేవి, స్కూలు అసిస్టెంట్, ఎర్రగుంట్ల



రవిశంకర్, స్కూలు అసిస్టెంట్, ముద్దనూరు



చాంద్‌బాషా, స్కూలు అసిస్టెంట్, ఎర్రగుంట్ల



ఎస్తేర్ సుకుమారి, స్కూలు అసిస్టెంట్, సీకే దిన్నె



సుబ్రహ్మణ్యం, స్కూలు అసిస్టెంట్, జమ్మలమడుగు



సుహాసిని, ఎస్జీటీ, పెండ్లిమర్రి



భాస్కర్‌రెడ్డి, ఎస్జీటీ, చక్రాయపేట



సుదర్శన్, ఎస్జీటీ, వేంపల్లె




రహీంబాషా, ఎస్జీటీ ఉర్దూ, సీకే దిన్నె



ఫాతిమా సుల్తాన, ఎస్జీటీ ఉర్దూ, చెన్నూరు



ఫరీదాభాను, ఎస్జీటీ ఉర్దూ, వేంపల్లె



వెంకట సుబ్బయ్య, స్కూలు అసిస్టెంట్, చెన్నూరు

# సమాజాన్ని మార్చేది ఉపాధ్యాయులే



పులివెందుల టౌన్: సర్వేపల్లె రాధాకృష్ణన్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



వేంపల్లె : బాలకొండ గంగాధర్‌ను సన్మానిస్తున్న జిల్లా డీఆర్ఓ విశ్వేశ్వరనాయుడు తదితరులు

**పులివెందుల టౌన్ :** ఉపాధ్యాయులది వృత్తి కాదని, ఒక సామాజిక బాధ్యత అని హెడ్మాస్టర్ వెంకట నాయుడు అన్నారు. పులివెందుల మండలం అచ్చివెళ్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా హెడ్మాస్టర్ వెంకట నాయుడు ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెడ్మాస్టర్ వెంకటనాయుడు ఉపాధ్యాయులు అంగడి నాగేంద్ర, నాగరాజు నాయక్‌లతో కలిసి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఆటల పోటీలు నిర్వహించారు. గెలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మధుసూదన్‌రెడ్డి, వలిసాహేబ్, సరోజ వాణి, విజయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

**ఉపాధ్యాయులకు సన్మానం**

**తొండూరు :** మండల కేంద్రమైన తొండూరు జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శనివారం ప్రముఖ ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి, రమణారెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల హెడ్మాస్టర్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజానికి దిక్సూచి అని, వారిని గౌరవించడం ప్రతి విద్యార్థి బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**బాలకొండ గంగాధర్ బహుముఖ ప్రజ్ఞాశాలీ**

**వేంపల్లె :** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న చరిత్ర అధ్యాపకుడు డాక్టర్ బాలకొండ గంగాధర్ బహుముఖ ప్రజ్ఞాశాలి అని కడప వైఎస్ఆర్ జిల్లా డీఆర్ఓ విశ్వేశ్వర నాయుడు పేర్కొన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని గురుపూజోత్సవం సందర్భంగా ఆఫీసర్స్ క్లబ్‌లో డాక్టర్ బాలకొండ గంగాధర్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ జాన్ ఇర్విన్ మాట్లాడుతూ గురుపూజోత్సవం సందర్భంగా ఇలాంటి అధ్యాపకుల సన్మానించడం ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు.

అనంతరం టీచర్ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ నాటి రాష్ట్ర ప్రభుత్వం 2013లో బెస్ట్ టీచర్ అవార్డు, 2024లో పర్యాటక రంగంలో తను రచించిన గ్రంథానికి రాష్ట్రస్థాయి అవార్డు దక్కిందన్నారు. ముఖ్య కార్యనిర్వహణ అధికారి డాక్టర్ జానమద్ది విజయభాస్కర్ మాట్లాడుతూ గంగాధర్ కోటిరెడ్డి మహిళా కళాశాలలో ప్రత్యేకంగా పర్యాటక రంగ శాఖనే నిర్వహించడంలో కీలక పాత్ర పోషించి, జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆఫీసర్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# ఆలోచనలను నియంత్రించుకోవాలి



మాట్లాడుతున్న వ్యాఖ్యాత హరి

**వేంపల్లె :** ప్రతి మనిషి తమ ఆలోచనలను నియంత్రించుకోవాలని వ్యాఖ్యాత హరి పేర్కొన్నారు. శనివారం ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో ఆర్ట్ ఆఫ్ మైండ్ కంట్రోల్ అనే అంశంపై విద్యార్థులకు ప్రేరణాత్మక ప్రసంగాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీకి విచ్చేసి ప్రసంగించారు. ప్రతి అనర్థానికి నియంత్రణలేని మనస్సు కారణమని, విద్యార్థులు వారి గురువులు, తల్లిదండ్రులు చెప్పిన మంచి విషయాలను మనసా వాచా కర్మనా పాటించాలని సూచించారు. అప్పుడే వారి లక్ష్యాలను చేరుకుంటారని తెలియజేశారు. పరిపాలన అధికారి రవికుమార్, స్టూడెంట్ వెల్ఫేర్ ఆఫీసర్ జి.వెంకటేష్, వార్డెన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



డ్రమ్ముల్లో అబైట్‌ను పిచికారి చేస్తున్న సిబ్బంది

**పులివెందుల రూరల్ :** పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్ధయ్య పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బొగ్గుడుపల్లెలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్ధయ్య ఆధ్వర్యంలో ఇంటింటా ఫీవర్, లార్వా సర్వేలు నిర్వహించారు. సిద్ధయ్య మాట్లాడుతూ వర్షాలు పడుతున్న నేపథ్యంలో ప్రజలు నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, నీటి తొట్లు, నీటి డ్రమ్ములు, నీరు నిల్వ ఉంచుకొనే ఇతర పాత్రలపైన మూతలు ఉంచాలన్నారు. దోమ కాటు ద్వారా మలేరియా, డెంగీ, ఫైలేరియా ఇతర వ్యాధులు వస్తాయన్నారు. ఆరోగ్య, ఆశా కార్యకర్తలు సోమలింగారెడ్డి, లక్ష్మీదేవి, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.